
# మహానగరం కథలు

## -వేదుల సుభద్ర





*మహానగరం కథలు*

**ఢిల్లీ, బొంబాయి, బెంగుళూర్, హైదరాబాదు, లండన్, పారిస్, న్యూయార్క్. పేరేదైనా, స్వదేశమైనా, విదేశమైనా.** ఉన్నది ఎక్కడైనా, తీరు, తెన్నూ ఒకటే.. ఆకాశాన్నంటే మేడలూ. ఇబ్బడి ముబ్బిడిగా పెరుగుతున్న వాహనాలూ, జనాభా, మారుతున్న ప్రజలూ, తరుగుతున్న వనరులూ మానవతా విలువలూ, రోజురోజుకీ చేరుతున్న ఊహకందని మార్పులూ, ఎటువైపో తెలియని జీవన పయనాలు.వెరసి. గజిబిజి బ్రతుకుల ఉరుకుల పరుగులతో .. మహానగరాలన్నీ "యమహా" నగరాలవుతున్నాయి.

కాలుష్యమూ, యాంత్రికీకరణా, మెటీరియలిజమూ, స్వార్థమూ, మనుష్యులమధ్య పెరుగుతున్న దూరాలూ, ఆర్థికసంబంధాలే జీవిత సంబంధాలనుకునే రోజులూ ... ఇవేనా నగరాలలోకనిపించేది? ఇంతకు మించి మరేమీ లేదా? కాదు.. తరచి చూస్తే ఆవేశాలూ, ఆనందాలూ, పురోగమనాలూ, బాంధవ్యాలూ, పోటీ తత్వాలూ, గెలుపిచ్చే సంతోషాలు. పంచుకుంటే పెరిగే సుఖాలూ మాట విరుచుకుంటే మిగలని సంబంధాలూ, వెతలే కాదు.. కతలూ కనిపిస్తాయి..

అత్యంత సంపన్నులూ, అతి నిరుపేదలూ కలిసి ఆకాశమనే ఇంటికప్పుకింద కలిసి చేసే సహజీవనాలే మహానగరాలు. ఓపికుండి వింటే సాలభంజికలని మించి చెప్పే కథా సాగరాలు. నిత్యం మారుతున్న మన రోజువారీ జీవన చిత్రాలు.. ఈ మహానగరం కథలు..!!

# పద్మవ్యూహం

అర్ధరాత్రి పన్నెండయినట్టుంది, గోడమీద 'కూ కూ' గడియారం కూసేసరికి మెలకువ వచ్చింది వసంత్ కి.

"ఇంకా ప్రియ రాలేదా?" అనుకుంటూ బెడ్రూం లోంచి లేచి ముందు గదిలోకి వచ్చాడు అతను, అప్పుడే తన తాళంచెవితో తలుపు తీసుకుని లోపలకి వస్తోంది పద్మప్రియ.

"అరే నువ్వింకా నిద్రపోలేదా?" అంది, చిన్నగా నవ్వడానికి ప్రయత్నిస్తూ. వసంత్ ఏమీ మాట్లాడలేదు.

" కమాన్ వసంత్, ఇంకొక్క రెండు నెలలు, అంతే కదా, ఆ తర్వాత నువ్వు ఆఫీస్ లోనే ఉండు అన్నాసరే, క్షణం కూడా ఉండను" అంది నవ్వుతూ

"సిద్ పడుకున్నాడా? సుశీలమ్మ ఉంది కదా!" అంది అతని మెడ చుట్టూ చేతులు వేస్తూ.

"ఓ పర్వాలేదు, సిద్ ఉన్నాడని గుర్తుంది కదా?" అన్నాడు కోపంగా, ఆమె చేతులు తప్పిస్తూ.

" ఓ మళ్ళీ మొదలుపెట్టకు వసూ, అది కూడా ఈ టైంలో, అంది చిరాకు పడుతూ, నీకు ఆఫీస్ లో లేట్ అయితే, నేనిలాగే అంటానా? జాబ్ అన్నాకా తప్పదు, అదెవరి జాబ్ అయినా ఒకటే, ఈ విషయం నీకెందుకు అర్థం కాదు? ఊరికే ప్రతీ సారీ ఇష్యూ చేస్తావు" అంది పిల్లాడి గదిలోకి నడుస్తూ.

బెడ్ లైట్ వెలుగులో మెరుస్తున్న మూడేళ్ళ పసివాడి బుగ్గలు ముద్దు పెట్టుకుని, చెదిరిపోయిన వాడి దుప్పటి సరి చేసి, ఏ.సీ టెంపరేచర్ సరిగా ఉందా చూసి లేవబోతున్నదల్లా కొంచం తూలినట్టయినిపించి కూర్చుండిపోయింది. దాన్నిగురించి పెద్దగా పట్టించుకోకుండా లేచి, తిరిగి హాల్ లోకి వచ్చింది.

" భోం చెయ్యవా? బైంగన్ భర్తా, సుశీలమ్మ చాలా బాగా చేసింది" అన్నాడు వసంత్.

" వద్దులే, టీం అందరికీ పీట్జాలు లు తెప్పించాను డిన్నర్ కి, అది ఒక ముక్క తిని కోక్ తాగాను రాత్రి, కొంచం కాఫీ తాగుతాను, చాలా టైర్డ్ గా ఉంది" అంది మైక్రోవేవ్ లో డికాక్షనూ, పాలూ పోసిన కప్పు పెడుతూ. వేడి అయిన కాఫీ ని తెచ్చుకుని సోఫా లో కూలబడింది. రెండు గుక్కలు తాగిందో లేదో హఠాత్తుగా పక్కకి ఒరిగిపోయింది, చేతిలోని కప్పు విట్రిఫైడ్ టైల్స్ మీద పడి భళ్ళున బద్దలైంది.

అప్పటివరకూ ఆమెనే తదేకంగా చూస్తున్న వసంత్

" అరే ఏమయింది? ప్రియా, ప్రియూ" అంటూ దగ్గరకొచ్చాడు, ఆమెని తట్టి లేపడానికి ప్రయత్నించాడు, ఆమె ఉలకలేదు, పలకలేదు. ఏం చెయ్యాలో తెలియలేదు అతనికి, ఎప్పుడూ లేనంత గాభరా వేసింది, పిల్లాడి గదిలోకి వెళ్ళి సుశీలమ్మని నిద్ర లేపాడు. ఇద్దరూ కలిసి హాల్ లోకి వచ్చేసరికి పద్మప్రియ అలాగే స్పృహ తప్పి పడుకునే ఉంది, ఆమె శరీరమంతా చెమటలు పట్టి చల్లగా ఉంది. ఉచ్ఛ్వాస, నిశ్వాసాలు చాలా మెల్లిగా వినబడుతున్నాయి. ఆమెనలా చూసేసరికి అతనికి మరింత గాభరా వేసింది,

"సుశీలమ్మా, ఏమయి ఉంటుంది తనకి?" అన్నాడు కంగారుగా.

"ఉండండి బాబూ, నేను చూస్తాను"అంటూ సుశీలమ్మ పద్మప్రియ కాళ్ళూ చేతులూ తన చేతులతో మర్దనా చెయ్యడం మొదలు పెట్టింది. వసంత్ తన స్నేహితుడు సునీల్ కి, డాక్టర్ వంశీకి ఫోన్ చేశాడు. కాళ్ళ కింద రెండు తలగడలు తెచ్చి పెట్టి, ఇద్దరూ కలిసి ఆమెని సోఫా మీదనించి తల కిందకి వేళ్ళాడేలా అమర్చారు డాక్టర్ వంశీ ఫోన్ లో ఇచ్చిన సలహాననుసరించి. అలా పెట్టిన రెండు నిమిషాలకి

కొద్దిగా కదిలి మూలిగింది ప్రియ. మాట్లాడించడానికి ప్రయత్నించిన వసంత్ యత్నం ఫలించలేదు. "ఊ" అని మాత్రం అంది, మగత నిద్రలో ఉన్నట్టు వొత్తిగిలి పడుకుంది.

"అదీ మంచిదే కుడివైపుకి తిరిగేలా చూడండి, వీ ఆర్ ఆల్మోస్ట్ దేర్" అని మళ్ళీ చెప్పాడు వంశీ, అతను చెప్పినట్టే చేశాడు. మరో పది నిమిషాల్లో సునీల్, డాక్టర్ వంశీ వచ్చారు.

" సునీల్, ప్రియ," కంగారుగా అన్నాడు గబ గబా అతని చెయ్యి పట్టుకుంటూ.

"ష్" షి విల్ బీ ఫైన్" అన్నాడు సునీల్ అనునయంగా.

వంశీ అప్పటికే పద్మప్రియ నాడీ, హార్ట్ బీట్ వగైరాలన్నీ చూశాడు, మరికొన్ని ముఖ్య లక్షణాలని పరీక్షించిన తర్వాత ఇంజక్షన్ చేశాడు.

మరొక రెండు మూడు నిమిషాల తర్వాత మెల్లిగా కళ్ళు తెరిచింది పద్మప్రియ.

"ప్రియా, ఏమయింది?" ప్రేమగా, అనునయంగా అడిగాడు వసంత్ ఆమె చేతిని పట్టుకుంటూ.

నీరసంగా నవ్వింది, అప్పటికి సుశీలమ్మ వేడిగా ఆమెకి పాలు, మిగతా అందరికీ కాఫీలు తెచ్చింది. ఆమె తెచ్చిన పాలు తాగి మరో మాట మాట్లాడకుండానే వసంత్ చెయ్యి అలాగే పట్టుకుని నిద్రలోకి జారిపోయింది పద్మప్రియ.

"మీ ఇద్దరికీ ఎలా థాంక్స్ చెప్పాలో తెలియడంలేదు, ఇంత రాత్రివేళ మిమ్మల్నిద్దరినీ చాలా ఇబ్బంది పెట్టాను, ఎప్పుడూ నవ్వుతూ, హాయిగా తిరిగే ప్రియని అలా చూసేసరికి తట్టుకోలేకపోయాను" అన్నాడు సారీ చెప్తున్నట్టు.

"మరేం పరవాలేదు, మనలో మనకి సారీలు, థాంక్స్ లూ ఎందుకు? చిన్న కరక్షన్, రాత్రివేళ కాదు పొద్దున్నే, టైము చూడు ఒకటి దాటింది " అన్నాడు సునీల్ నవ్వుతూ. వంశీ కూడా నవ్వాడామాటలకి.

"మిగతా విషయాలన్నీ రేపు మాట్లాడదామన్నారు, ఓ కే, కానీ అసలు తనకేమయింది? ఎందుకలా ఉన్నట్టుండి పడిపోయింది? ఈజ్ ఎవిరీథింగ్ ఓ కే? "అన్నాడు వసంత్ ఆందోళనగా

" శారీరికమైన, మానసికమైన వత్తిడి బాగా, అంటే తట్టుకోలేనంతగా ఎక్కువైతే అప్పుడప్పుడు ఉన్నట్టుండి నరాల వ్యవస్థ పనిచేయక గుండెకి రక్త సరఫరా కొన్ని క్షణాలు నిలిచిపోయి ఇలా స్పృహ కోల్పేయే అవకాశం ఉంది, నా ఉద్దేశ్యంలో ప్రియగారికి అదే జరిగిఉండాలి. తనకేమీ వేరే ప్రోబ్లం లేదు కదా? స్ట్రెస్ కుడ్ బీ ద మెయిన్ కాస్ "అన్నాడు వంశీ

" స్ట్రెస్.. హ. "అన్నాడు వసంత్ బాధగా. "ఒప్పుకోదు కానీ స్ట్రెస్ మాత్రమే ఉంది తనకి, తను ఇప్పుడు చేస్తున్న ప్రాజెక్ట్ చాలా పెద్దది, ఇద్దరు ప్రోగ్రాం మేనేజర్లలో తను ఒకతి, కానీ ఇది చాలా ఇబ్బందుల్లో పడేసరికి అతను చాలా తెలివిగా ముందే వేరే కంపెనీకి వెళ్ళిపోయాడు, దానివల్ల మొత్తం తనమీద వేసుకుని చాలా ఛాలెంజ్ గా తీసుకుని ఇంతవరకూ తెచ్చుకుంది.

" సునీల్ నీకు తెలుసు కదా, మొదటినించీ తనెంత యాంబిషియసో, 'గో గెటరో'. అంత అనుభవం ఉన్న మరొకతనికోసం చూస్తున్నారు కానీ ఇంకా ఎవరూ దొరకలేదుట ఇలా గత నాలుగు నెలలుగా చెప్తూనే ఉంది, ఇద్దరి పనీ తనే చూసుకోవాలి, చాలా పెద్ద టీం, మూడు దేశాల్లో జరగాల్సిన ప్రాజెక్ట్, అందుకే ఇంత వత్తిడి " అన్నాడు దిగులుగా.

" వంశీ, నా ప్రియకేమీ కాదు కదా?" అన్నాడు చిన్నపిల్లాడిలా.

"ఛ ఛ, అలాంటిదేమీ లేదు, షీ నీడ్స్ ఏ బ్రేక్, అంతే, ఒకసారి రేపు మా హాస్పటల్ కి రండి, చిన్న చిన్న పరీక్షలు చేద్దాం, అంతకుమించి కంగారు పడడానికేమీ లేదు, " అన్నాడు వంశీ చిరునవ్వుతో.

ఓకే, సర్టెన్లీ, అన్నాడు వసంత్. వాళ్ళిద్దరికీ మరొక్కసారి ధన్యవాదాలు చెప్పి సాగనంపాడు.

బెడ్ రూం లోకి వెళ్ళి మరొక దిండూ, రెండు దుప్పట్లూ తెచ్చాడు, సోఫా పక్కనే కార్పెట్ మీద వాటినుంచి ప్రియ ముఖం వైపు తదేకంగా చూశాడు.

"తనూ తీరిగ్గా చూడలేదు కానీ ఎలా ఉండేది ఎలా అయిపోయింది? కళ్ళకింద నల్లటి వలయాలు, ముప్పై రెండేళ్ళకే కనిపిస్తున్న లాఫ్ లైన్స్, లోతుకు పోయినట్టున్న చెక్కిళ్ళూ, కొద్దిగా వత్తు తగ్గి, ఎండిపోయినట్టున్న జుట్టూ, ఎంత ఆరోగ్యంగా ఉండేది? ఇలా అయిపోయిందేమిటి? " అనుకున్నాడు బాధగా.

ఆమెకో దుప్పటి కప్పి కాసేపు తన జుట్టునీ, చెంపలనీ నిమురుతూ కూర్చుండిపోయాడు, తర్వాత మెల్లిగా కార్పెట్ మీద తలగడ వేసుకుని వాలాడు. పడుకున్నాడే కానీ నిద్ర అంత తొందరగా రాలేదు, సుశీలమ్మ కూడా రెండు సార్లు వచ్చి "పడుకోండి బాబూ" అని చెప్పి వెళ్ళింది. పక్కకి తిరిగి పడుకుని ప్రియనే చూస్తున్నాడు.

"ప్రియ ఎప్పుడూ ఇంతే, పట్టు పట్టిందంటే ఇంక వదలదు, ఎన్నేళ్ళనించీ తెలుసు తన సంగతి, ఇప్పుడు కొత్తగా చెప్పుకోవడానికేముంది? అని ఒక పక్కా, "

"పని అందరమూ చేస్తాము, కానీ మరీ ఇంతగా  మీదకు తెచ్చుకునేలా పని చెయ్యడం అవసరమా? తనొక్కర్తే ఉద్యోగం చేస్తోందా? ఈ రోజు ఇంట్లో అయినది ఆఫీస్ లోనో, రోడ్డు మీదో జరిగి ఉంటే?" అని మరొక పక్కా సాగుతున్నాయి అతని ఆలోచనలు.

అలా రకరకాలైన ఆలోచనలతోనూ, మధ్యలో ప్రియకి మళ్ళీ ఏమైనా అవుతుందేమో అన్న భయంతోనూ ఎప్పటికో నిద్రపోయాడు. పొద్దున్నే గడియారం పదిసార్లు కూస్తే కానీ అతనికి మెలకువ రాలేదు.

ఎవరో తట్టినట్టు గభాల్న లేచాడు, క్షణంలో రాత్రి జరిగినదంతా గుర్తుకు వచ్చి పక్కన సోఫా వైపు చూశాడు. పద్మప్రియ అక్కడ లేదు.

"ప్రియా, ప్రియూ !" అని పిలుస్తూ బెడ్ రూం వైపుకి వెళ్ళాడు, ఎవరూ లేరు, సిద్ధాంత్ కూడా లేడు, వాడి రూములో. వెంటనే ఫోన్ చేశాడు ప్రియకి.

" హాయ్, వసూ! హా, నువ్వు పడుకున్నావు కదా, అని నిద్ర లేపలేదు. నేనా? యా ఆఫీస్ కే, సిద్? వాడిని ఈ రోజు మాలా, కైలాష్ వాళ్ళు , వాళ్ళ పిల్లాడు కేదార్ తో పాటు జూ కి తీసుకె ళ్తామన్నారు, నీకు తెలుసుగా పిల్లలిద్దరూ ఫ్రెండ్స్ కదా, యూ డోంట్ వర్రీ, హీ విల్ బీ ఫైన్, సాయంత్రం నేనే తీసుకొస్తాను ఆఫీస్ నించి వచ్చేటప్పుడు. నువ్వు ఆఫీస్ కి వెళ్ళాలంటే హాయిగా వెళ్ళు, " ఇలా అతని ప్రశ్నలకి టకటకా సమాధానాలు చెప్పేసింది.

" పైగా పోలీస్ ఉన్నాడు, మాట్లాడుతూ డ్రైవ్ చెయ్యలేను, మధ్యాహ్నం చేస్తాను "అని పెట్టేసింది.

“హా మర్చిపోయాను, సుశీలమ్మ కూతురింటికి వెళ్తానంది, రేపు వచ్చేస్తుంది, కుక్ రీటా వస్తుంది, నీకేం కావాలో తనకి చెప్పేస్తే చేసేసి వెళ్ళిపోతుంది, పొద్దున్నే మాట్లాడాను దాంతో, బ్రేక్ ఫాస్ట్ కి కి మ్యూసిలి ఉంది, పళ్ళు ఉన్నాయి” ‘అన్నీ ఆలోచించి ప్లాన్ చేశాను ' అన్న ప్రోగ్రాం మేనేజర్ తరహాలో మాట్లాడుతోంది ఎప్పటిలాగే.

"అదికాదు ప్రియా, రాత్రి ఏమయిందో నీకేమైనా తెలుసా? తెలిసే మాట్లాడుతున్నావా?" అని ఇంకా ఏదో చెప్పబోతుంటే అతన్ని మధ్యలోనే ఆపి..

"అబ్బా వసంత్, రాత్రి కొంచం అలిసిపోయాను అంతే కదా, దానికే నాకేదో ఐపోయినట్టు ఎందుకంత హడావిడి? నాకేమీ కాదు, ఐ యాం ఫైన్, ఈ ప్రోజెక్ట్ నేను అనుక్కున్నట్టు అయిపోతే నేను ' గ్లోబల్ డెలివెరీ టీం' కి హెడ్ అయిపోతాను, చూడు! అది నేను ఎదురు చూసేది, ఇంతలో నువ్విలా చిన్న విషయాలకోసం వరీ అయి నన్ను విసిగించకు " అంది కొంచం కటువుగా.

"విసిగించకు" అన్న మాట ఆమె అనాలి అనుకుని అందో, అథాట్టుగా అందో తెలీదు కానీ అది వసంత్ కి సూటిగా తాకింది. వెంటనే ఫోన్ పెట్టేశాడు. ఎవరిమీదో తెలియని కోపం, ఫోన్ విసిరేసినట్టు పడేసాడు, అదృష్టవశాత్తు కార్పెట్ మీదే కాబట్టి చిన్నగా శబ్దం చేస్తూ పడింది తప్ప పగలలేదు. లేచి కాఫీ మేకర్ లో డికాక్షన్ తీసుకుని, పాలు, చక్కెరా కలిపి కప్పులో పోసుకుని మైక్రోవేవ్ లో పెట్టుకుని వేడి చేసుకున్నాడు. పేపర్ తీసుకుని బాల్కనీలో కూర్చున్నాడు. కళ్ళు అక్షరాల వెంబడి వెళుతున్నాయి కానీ మనసులోకి ఏదీ ఎక్కడం లేదు.

తనకీ ఆఫీస్ లో పని ఉన్నా కనీసం ఈ వీకెండ్ కి ప్రియనీ, సిద్ధుని ఎక్కడికైనా తీసుకెళ్దామనీ, ఈ వంటవాళ్ళూ, పనివాళ్ళూ లేకుండా కేవలం తాము ముగ్గురమూ మాత్రమే ఉండేలా ప్లాన్ చెయ్యాలని ఎంతో అనుకున్నాడు, రాత్రి జరిగిన సంఘటన తర్వాత ప్రియని వంశీ హాస్పటల్ కి తీసుకెళ్ళచ్చు, సుశీలమ్మ రాదు కనక సిధూ ని దగ్గరుండి చూసుకోవచ్చు అనే ఈ రోజు రానని చెప్పాడు. కానీ ప్రియ చూస్తే ఇలా,

ఈ ప్రాజెక్ట్ కాదు గానీ గత మూడు నెలలుగా ఇదే అవుతోంది ప్రియతో, దాదాపు ప్రతీ శనీవారం, ఆదివారం ఆఫీస్ కి వెళుతూనే ఉంది, ఏమైనా అంటే " అన్నీ తెలిసీ నువ్వే ఇలా అంటే ఎలా?" అంటుంది. లేదంటే ' స్త్రీవాదం 'వినిపిస్తుంది.

కాఫీ కూడా తాగలేదు అతను, ప్రియ వాళ్ళ అమ్మ ఫోన్ కి ఫోన్ చేశాడు.

"వసంత్, బావున్నావా బాబూ, ప్రియా, సిద్ ఎలా ఉన్నారు? అది ఫోన్ చేసి రెండు రోజులయింది, పనిలో బిజీగా ఉందేమో అనుకున్నాము" అందావిడ.

"అవునాంటీ, తను చాలా బిజీగానే ఉంది అంటూ వీలైనంత సౌమ్యంగానే రాత్రి జరిగినదంతా చెప్పాడు. మీరిద్దరూ వీలైతే ఒకసారి వస్తే, కనీసం ఈ ప్రాజెక్ట్ పూర్తయ్యేవరకైనా ఇక్కడుంటే బావుంటుందేమో, కనీసం మీ మాటైనా వింటుందేమో! అని" అంటూ చెప్పాడు.

" నాకూ ఉండాలనే ఉంటుంది వసంత్, కానీ ఇక్కడ మీ అంకుల్ కి యూనివర్శిటీ లో చాలా పని, ప్రాజెక్ట్ లు రెండు శాంక్షన్ అయ్యాయి, వాటి పని మొదలు పెట్టాలి, పీ.జీ ఎడ్మిషన్స్ జరుగుతున్నాయి, అందావిడ. సాయంత్రం ఫ్లైట్ కి వచ్చి రెండు మూడు రోజులుండి వెళతాములే, మీ అంకుల్ కి చెప్తాను " అందావిడ.

"హు" అని నిట్టూర్చాడు.

"మీ ఇష్టం ఆంటీ, టైమూ, ఫ్లైట్ నంబరూ చెప్తే నేను ఎయిర్ పోర్ట్ కి వస్తాను మిమ్మల్ని తీసుకెళ్ళడానికి" అన్నాడు ఫోన్ పెట్టేస్తూ. తర్వాత అమ్మా, నాన్నలతో మాట్లాడాడు.

" వసూ, అలా డల్ గా ఉండకు, చిన్నప్పటినించీ కలిసి పెరిగారు, ప్రియ సంగతి నీకంటే ఎవరికి బాగా తెలుసు? అయిపోతుంది అంటోంది కదా, కొన్నాళ్ళు ఓపిగ్గా ఉండు, తొందరపడి తననేమీ అనకు, చిన్నబుచ్చుకుంటుంది, కావాలంటే నేనూ, నాన్నా వచ్చి నాలుగురోజులుంటాములే," అందావిడ.

" అయిపోతుంది! అని చెప్పలేను అమ్మా, నీకూ తెలుసు కదా ప్రియ గురించి, ఇదయిపోతే మరొకటి పెట్టుకుంటుంది. నేనే ఏదో ఒకటి చెయ్యాలి! అన్నాడు చిరాగ్గా, ఆంటీ వాళ్ళు వస్తామన్నారు సాయంత్రమో, రేపో, వాళ్ళు వెళ్ళాకా చూద్దాములే, మీరు రావడం గురించి , అన్నాడు అసహనంగా ఫోన్ పెట్టేస్తూ.

---------------

ప్రియావాళ్ళూ , తామూ హైదరాబాద్ లో నల్లకుంట లో ఒకే ఇంట్లో రెండు పోర్షన్ లలో ఉండేవారు. ప్రియా, ఆమె తమ్ముడు సంపత్. తనూ, అక్క స్రవంతి. అమ్మ దగ్గరలోనే స్కూల్ లో తెలుగు టీచర్ గా పనిచేసేది. రమాంటీ చాలారోజులు ఇంట్లోనే ఉండేది. తర్వాత ఇంట్లోనే ట్యూషన్ లు చెప్పేది, అలా ఎప్పుడూ ఇంట్లోనే ఉండే ఆంటీని చూస్తే తనకీ, అక్కకీ ఎంతో ఆశ్చర్యం గా ఉండేది.

'అమ్మలా ఆంటీ ఎందుకు ఉద్యోగం చెయ్యదు? లేదా అమ్మ కూడా ఆంటీలా ఎందుకు ఇంట్లోనే ఉండదు?' ఇలా అనుకునేవారు. దాదాపుగా ముగ్గురూ కలిసే వచ్చేసేవారు స్కూల్ నించి, కానీ ఎప్పుడైనా అమ్మ రావడం లేట్ అయినా, లేదా తను ఎలెక్షన్స్ కో, జనాభా లెక్కలకో డ్యూటీ మీద వెళ్ళవలసి వచ్చినప్పుడు మాత్రం అమ్మని బాగా మిస్ అయేవారు, ఆ రెండు రోజులూ అమ్మమ్మో, అత్తో ఎవరో ఒకరు వచ్చి ఉండేవారు. నాన్నకి అగ్గిపుల్ల వెలిగించడం చాతకాదు.

ప్రియా, సంపత్ వాళ్ళ నాన్నగారు ప్రసాద్ గారు యూనివర్సిటీలో పనిచేశేవారు. ఎప్పుడూ ప్రాజెక్ట్ లూ, అవీ అంటూ బిజీగా ఉండేవారు.

ఆడవాళ్ళు ఉద్యోగాల మీద మక్కువ చూపించడం మొదలవుతున్న రోజులవి, తాతగారు అమ్మావాళ్ళనీ మొదటినించీ బాగా చదువుకోమని ప్రోత్సహించారుట, అందుకనే అమ్మా, పిన్నీ కూడా ఒకరు గవర్నమెంట్ స్కూల్లోనూ, మరొకరు గవర్నమెంట్ లోనూ ఉద్యోగాలు సంపాందించుకున్నారు మావయ్యలతో సమానంగా. అప్పట్లో తమ చుట్టాల్లో అదొక గొప్ప విషయంగా చెప్పుకునేవారు.

"అక్కా, నీకే నయమే, చక్కగా పిల్లలకి సెలవులిచ్చినప్పుడల్లా సెలవులు, వాళ్ళగురించి బెంగక్కరలెదు, నాకలా కాదుగా!" అనేది పిన్ని అప్పుడప్పుడు.

హోం వర్కులూ, అసైన్మెంట్లూ, పరీక్ష పేపర్లూ, స్పాట్ వాల్యుయేషన్ లూ, ఇవన్నీ కాక జండా వందనాలు, స్కూల్ డేలూ, ఇన్స్పెక్షన్ లూ, వీటన్నింటిమధ్యనా సిలబస్ పూర్తి చెయ్యడాలు, తన ఉద్యోగాన్ని ఎంతో బాధ్యతగా చేసే అమ్మకీ పని తక్కువేమీ ఉండేది కాదు. అయినా ఆమె తాము ఇంట్లో ఉండే టైమంతా, సెలవులతో సహా తమతోనే ఉండేది. తననీ, అక్కనీ బాగా చదువుకోమని చెప్పేది తప్ప ఎప్పుడూ ఒత్తిడి పెట్టింది లేదు. నాన్న మాత్రం ఎప్పుడూ బాగా చదవాలనీ, అన్నింట్లోనూ ముందుండాలనీ చెప్పేవారు తరచూ.

తనూ ప్రియా మొదట్లో అమ్మ స్కూల్ లోనే చదివేవారు, కానీ ఆ తర్వాతే అప్పుడే మొదలవుతున్న కార్పోరేట్ కాలేజీ లో ప్రముఖమైన దాంట్లో తనని చేర్చారు ప్రసాద్ అంకుల్.

"మీ వాడిని కూడా అందులో చేర్చేయ్ నా మాట విని, కాలేజీ, కోచింగూ అన్నీ ఒకే చోట అయిపోతాయి" అన్నారు నాన్నతో. వెంటనే తనూ, ప్రియ ఉన్న కాలేజీలోనే చేరాడు. ప్రతీ రోజూ పరీక్షలు, చెయ్యాల్సిన లెక్కలూ, వీటిమధ్యన ఎలా జరిగిపోయిందో తెలియకుండానే కరిగిపోయిన కాలం.

ప్రియ ది మొదటినించి గెలిచి తీరాలనే మనస్థత్వం, ఎప్పుడూ' గో గెటర్' . అన్నింటిలోనూ ముందే ఉండేది.

"ప్రియ లాంటి కూతురుంటే ఎంత అదృష్టమో, అన్నింట్లోనూ ఫస్టే" అని అందరూ అంటూ ఉంటే రమా ఆంటీ మురిసిపోయేది. ఎలాగైనా ఐ.ఐ.టీ లో సీట్ సాధించాలనీ, తనకున్న తెలివి తేటలకి తను అనుకోవాలే, గానీ తప్పక సాధిస్తుందనీ ఇంచుమించు రోజూ నూరిపోసేది ఆంటీ. అదీ కాక, తమ బంధువుల్లో ఆడపిల్లలెవరూ ఐ. ఐ.టీలో చదువుకోలేదు, కనక అది ప్రియ సాధించాలని ఆవిడకీ, అంకుల్ కీ కూడా బాగా ఉండేది. దానికి సాయం, ప్రియ కూడా ఎప్పుడూ విపరీతంగా చదువుకునేది, చిన్న క్లాస్ టెస్ట్ లో అయినా సరే ఒక్క మార్క్ తక్కువొచ్చినా, ఫస్ట్ రాకపోయినా ఆమె ఎంతో అవమానంగా భావించేది, తర్వాత పరీక్షలో మళ్ళీ మొదటి రాంక్ వచ్చేవరకూ నిద్రపోయేది కాదు. తనేమో ఆమెకి వ్యతిరేకంగా ఉండేవాడు. సమయానికి తగ్గట్టుగా చదువుకుంటూనే స్నేహితులూ, సరదాలు వేటికీ దూరం కాకుండా ఉండేవాడు, అమ్మ పెద్దగా ఏమీ అనకపోయినా నాన్న మాత్రం తిట్టేవారు.

" ప్రియ ని చూడరా, ఆడపిల్లైనా ఐ. ఐ టీ లో చేరాలన్న పట్టుదలతోనే అహోరాత్రాలు చదువుతోంది, నీలా కాదు" అనేవారు. అనుకున్నట్టే ప్రియ మెడ్రాస్ ఐ.ఐ.టీలో కంప్యూటర్ ఇంజనీరింగ్ లో సీట్ సాధించింది తొలి ప్రయత్నంలోనె, తను కూడా అక్కడే 'అన్నా కాలెజ్ ఆఫ్ ఇంజనీరింగ్' లో చేరాడు.

బాగా చిన్నప్పుడు కొట్టుకోవడంతోనూ, పితూరిలతోనూ ప్రారంభమయిన తమ స్నేహం ఎప్పుడో ఇద్దరికీ తెలియకుండానే ప్రేమగా మారింది. ఇంజనీరింగ్ అవగానే ఇద్దరికీ కాంపస్ లో ఉద్యోగాలు రావడంతో మరో మాట లేకుండా తాను చేరిపోయాడు. ప్రియ మాత్రం ఐ.ఐ.ఎం లో ఎం.బీ.ఏ చదువుతాననీ, లేదా బయటకు వెళ్ళి ఎం.టెక్ చేస్తానని అంది.

అప్పుడైనా ఎంట్రీ లెవెల్ లోనే ఉద్యోగంలో చేరాల్సి ఉంటుందనీ, అప్పటికి తనకంటే ముందు చేరినవారు రెండేళ్ళ అనుభవం వల్ల ముందుకెళ్ళిపోతారని స్నేహితులు చెప్పడం వల్ల, మళ్ళీ ఆలోచించుకుని ఉద్యోగంలోనే చేరింది. అప్పటికిద్దరికీ 22 ఏళ్ళు. మరో రెండేళ్ళకి ప్రియకి పెళ్ళి సంబంధాలు చూస్తున్న సమయంలో నెమ్మదిగానే చెప్పారు ఇద్దరూ ఇంట్లో. ఇద్దరిదీ ఇంచుమించు ఒకటే వయసు అన్నది తప్ప ఇంట్లో వారికేమీ అభ్యంతరం కనిపించలేదు, పైగా అప్పటికే అక్క పెళ్ళి అయింది కూడా. ఇరవై నాలుగేళ్ళ వయసులో పెళ్ళి అయింది ఎనిమిదేళ్ళక్రితం.

ఇద్దరివీ వేరే, వేరే కంపెనీలైనా ఒకేలాంటి ఉద్యోగాలు, రకరకాల ప్రాజెక్ట్ లూ, వాటికోసం మితి లేకుండా పెంచుకోవాల్సిన పనివేళలూ, ఆన్ లైన్ ఎసైన్ మెంట్ లూ, ఇలా మొదటి మూడేళ్ళూ ఎలా గడిచాయో? తెలియకుండానే గడిచిపోయాయి. గత నాలుగేళ్ళలో ప్రియ తనకంటే ముదుగానే ప్రమోషన్ లు సాధించింది, ఒక ఏడాది పాటు ఆన్ సైట్ కి వెళ్ళి వచ్చింది, ఇప్పుడీ పెద్ద ప్రాజెక్ట్ ని చేపట్టింది, తను కూడా మేనేజర్ అయ్యాడు కానీ టెక్నికల్ వైపు ఉండడానికే ఇష్టపడ్డాడు, కోడింగ్ తనకెంతో ఇష్టం అందుకే, దానికే ప్రియ చాలా గొడవ చేసింది, 'పెద్ద మేనేజర్ అయ్యే అవకాశాలు వదులుకుంటున్నావు' అని సాధించింది. కానీ తనకెందుకో ఉత్తి మేనేజ్మెంట్ అంటే ఇష్టం లేదు అందుకే పెద్దగా పట్టించుకోలేదు.

సాయంత్రానికల్లా రానేవచ్చారు ఆమె తల్లితండ్రులు, ప్రియకంటే ముందుగానే.

" అదేంటంకుల్? ఫోన్ చేస్తే నేను వచ్చేవాడినిగా ఎయిర్ పోర్ట్ కి, ఇంట్లోనే ఉన్నాను పొద్దున్నించీ" అన్నాడు నెమ్మదిగా.

"పరవాలేదులే వసంత్, టాక్సీ లో ఎంతసేపు రావడం? తెలియని చోటు కాదుగా, మళ్ళీ నిన్నిబ్బంది పెట్టడమెందుకని? అన్నారాయన నవ్వుతూ. అదీకాక నువ్వు చాలా డల్ గా మాట్లాడావని మీ ఆంటీ ఒకటే గొడవ. ఏమయింది? ఎవిరీథింగ్ ఓకే? సిధూ, ప్రియా ఏరి?" అన్నారాయన.

" రాత్రి అంత జరిగినా, అది ఏమీ మారలేదన్నమాట? ఆరోగ్యం ఎలా ఉంది? అనైనా చూసుకోవద్దూ? , నీ ఫోన్ అయిన వెంటనే దాంతో మాట్లాడానులే, బావున్నాను, ఊరికే కంగారు పడతాడు వసంత్ అన్నింటికీ అంది, దాని మాట సరే నువ్వేమిటీ ఇలా ఐపోయావు? నువ్వు భోజనం చెయ్యలేదా వసంత్? అన్నీ అలాగే ఉన్నాయి?" అందావిడ కిచెన్లోకి ప్రవేశిస్తూ.

మరొక అరగంటకి వచ్చింది ప్రియ, రెండు ఫోన్ కాల్స్ తర్వాత.

" సిధూ నిద్రపోయాడు వెనక సీట్లో, కిందకొస్తావా? వాడిని ఎత్తుకోవడానికి?" అని అడిగితే కిందకి వెళ్ళి ఇద్దరూ కలిసి వచ్చారు. పైకి.

"రేపు కూడా ఆఫీస్ కి వెళ్ళాలా?" అంది రమాంటీ కోపంగా.

" సగం రోజేనమ్మా, మధ్యహ్నం లంచ్ టైముకల్లా వచ్చేస్తాను "అంది ప్రియ నవ్వడానికి ప్రయత్నిస్తూ.వసంత్ ఏమీ మాట్లాడలేదు, మౌనంగా ఉన్నాడు.

రాత్రి పడుకోబోయేముందు ప్రియతో అన్నాడు

"నేను కొన్నాళ్ళు బ్రేక్ తీసుకోవాలని అనుకుంటున్నాను ప్రియా, ఐ వాంట్ టు క్విట్ మై జాబ్ "అని.

పక్కలో బాంబ్ పేలినట్టు ఉలిక్కిపడింది ప్రియ.

"వాట్, ఆర్ యూ మేడ్? ఇంత మంచి జాబ్ ని వదిలేస్తావా? ఆర్ యూ అవుట్ ఆఫ్ యువర్ సెన్సస్?" అంది కోపంగా.

"లేదు, నేను లక్షణంగా ఉన్నాను, నా బుద్ధిపూర్వకంగానూ, సంపూర్ణ ఇష్టంతోనూ రాస్తున్న విల్లు అన్న తరహాలో డాక్యుమెంట్ రాసి సంతకం పెట్టమంటే దానికీ సిద్ధం, గుడ్ నైట్!" అని గోడవైపు తిరిగి సిద్ధూ మీద చెయ్యివేసుకుని పడుకున్నాడు.

ఏదో విచిత్రాన్ని చూస్తున్నట్టు ఉండిపోయింది ప్రియ. వెంటనే పక్కగదిలో పడుకున్న తల్లి తండ్రులదగ్గరకెళ్ళి చెప్పింది.

"పొద్దున్నే మాట్లాడదాంలేమ్మా, హీ ఈజ్ నాట్ వెల్, ఇప్పుడు పడుకో!" అన్నారాయన.

" దిస్ ఈజ్ ఫూలిష్" అంది కోపంగా.

"ప్రియా, ఊరుకో, పొద్దున్న మాట్లాడదాం అన్నారుగా నాన్న," అంది రమ కూడా కొంచం కోపంగా.

మర్నాడు పొద్దున్నే నిద్ర లేస్తూనే,

"నేనిలా చాలా ఎక్కువ పనిచేస్తున్నానన్న కోపంతో నన్నేడిపించడానికి అలా అన్నావు కదూ?" అంది.

"లేదు, నిజమే, నేనేమీ జోక్ చెయ్యడం లేదు"అన్నాడు వసంత్. అప్పుడే కాఫీ కప్పులతో వచ్చింది రమ.

"వసంత్, ప్రియకి వంట్లో బాగాలేదు అని నువు దిగులు పడుతున్నావని మేము పరిగెత్తుకుని వచ్చాము, ఇదేమిటి? ఇక్కడ పరిస్థితి చూస్తే నీకే బాగోలేదోమో అనిపిస్తోంది. జాబే మానేస్తాను అంటున్నావట, ఏమయింది? ఎనీథింగ్ రాంగ్?" అన్నారు ప్రియ నాన్న ప్రసాద్.

" నిన్ను బెంచ్ మీదకి వెళ్ళమనడం లేదు కదా?" అంది ప్రియ ఆతృతగా.

" ప్రియా ప్లీజ్!" అన్నాడు కోపంగా.

" మరేమిటి? అడిగితే కోప్పడతావు, నీ అంతగా నువ్వు చెప్పవు, ఇలా అయితే ఎలా?" అంది ప్రియ కోపంగా.

" ఇందులో చెప్పడానికేమీ లేదు ప్రియా, ఈ పరుగులాటలో నేను అప్పుడే అలిసిపోయాను అనిపిస్తోంది నాకు. ఇది కేవలం నా భావన, చిన్నప్పటినించీ దేనికో దానికి పరిగెడుతూనే ఉన్నాను, అది చిన్నదవనీ, పెద్దదవనీ.

అది స్కూల్ లో జరిగే లెమన్ అండ్ స్పూన్ అనే చిన్న పోటీ నుంచీ, క్లాస్ ఫస్ట్ రావడం, స్కూల్ లీడర్ కావాలి, బెస్ట్ ఎన్. సీ. సీ కేడెట్ అనిపించుకోవాలి, మంచి కాలేజీలో సీట్ తెచ్చుకోవాలి అనే అన్ని విషయాల వరకూ..

ఆ తర్వాత కాలేజీలో అహోరాత్రాలూ, నిద్రకీ, నీళ్ళకీ కూడా టైం లేనంతగా చదివేసి, గొప్ప గొప్ప రాంకు లు తెచ్చేసుకోవాలి, నీకు గుర్తుందా? ఇంటర్మీడియేట్ రెండేళ్ళు నీలా ఇష్టంగా, కష్టపడ్డవాళ్ళెందరున్నారో? మహా అయితే ఇంకో నలుగురు, మిగతావారందరికీ ఆ రెండేళ్ళు చదివిన చదువు, గొంతులో పోసిన కషాయంలా మింగలేకా, కక్కలేకా ఏదో అయిందనిపించి తుమ్మిన వాళ్ళే కదా.

అదయిందిరా, అనుక్కుంటే ఇంజనీరింగ్ లో గ్రేడ్ ల పోరాటం, అవి సరిగా రాకపోతే కాంపస్ ఉద్యోగాలు రావన్న ఆరాటం. దానికోసమే కదా అందరమూ పగలూ రాత్రీ చదివేవాళ్ళం, సినిమాల్లో చూపించనట్టుండేదా? మనం చదివిన కాలేజీల్లో?

ఉద్యోగంలో చేరాకా, మరో రకమైన పోటీ, ఎప్పుడూ పక్కవాడికంటే నేనెలా పైనుండాలి? అనే 'వన్ అప్మెన్షిప్' తప్ప, నిజంగా నేర్చుకోవాలి అన్న తపన ఎవరికుంది? ఎంతసేపూ ఆన్ సైటులూ, ఆపరేటింగ్ మార్జిన్ లూ, రీసోర్సెస్ లేదా బోడీస్ అంటూ

వస్తువులని మార్చినట్టు మనుషులని ఆ ప్రోజెక్ట్ నించి ఈ ప్రాజెక్ట్ లోకి మార్చడాలు, దాన్ని చూసుకోవ డానికీ, ఏదైనా తేడావస్తే తీసి అవతల పెట్టడానికీ 'ఓ తల' ఉండాలి కనక మనలాంటి మేనేజర్ లూ. ఎప్పుడూ క్లయింట్ అనే 'దేవుడు' ఏం చెప్తే అది తూ. చ తప్పకుండా చెయ్యడమే తప్ప మన బుర్ర వాడడానికి వీలేది?

ఇక ఇంటి విషయం అంటావా? ఎప్పుడొస్తామో? తెలీదు, ఏం తింటున్నామో? తెలీదు, మన ఇంట్లో మనమే, కేవలం మనమే ఉండే వీలు కూడా లేదు. ఇద్దరు పనిమనుషులూ, ఒక వంటమనిషి, కం ఆయా సుశీలమ్మా, ఎప్పుడూ ఎవరో ఒకరు, నేను నా భార్యతో సరదాగా ఉండాలన్నా, నేను కొందామనుకుంటున్న ఇంటి గురించో, పెరిగిన జీతం గురించో నా తల్లితండ్రులకో, అక్కకో , అంకుల్ వాళ్ళకో చెప్దామన్నా వీలు లేని పరిస్థితి. నాకంటూ లేని నా సమయం, నాదంటూ లేని స్థలం. ఇదంతా అవసరమా?

పొద్దున్నే లేస్తే కేవలం మన అవసరాలన్నీ టైం టేబిల్ ప్రకారం 'ఎం. ఎస్ ప్రోజెక్ట్ లో' వేసుకున్న ప్రణాళికలా జరుగుతున్నాయా లేదా అన్న టిక్ మార్క్ పెట్టుకోవడమే తప్ప ఇంకేదైనా ఉందా? నెలలో రెండు వీకెండ్ లు నువ్వు పని చెయ్యాల్సి వస్తే రెండు నేను చెయ్యవలసి రావచ్చు, నేనొచ్చిన వెంటనే నువ్వు ఆన్ సైటు వెళ్ళడం అవీ జరగలేదూ ? మనకి.

అన్నింటికంటే బాధాకరమైన విషయమేమిటో తెలుసా ప్రియా? నాకూ నిన్నరాత్రే తెలిసింది. మనం ఆఫీసుల్లో చేసే ప్రోజెక్టులు ఎన్నో లక్షల, కోట్ల రూపాయల విలువైనవి కనక అవన్నీ సజావుగా జరగడానికి ముందు గానే రిస్క్ అసెస్మెంటూ, మేనేజ్మెంటూ, మిటిగేషన్ ( Rish assessment, management and mitigation) అంటూ ప్లాన్ చేస్తాం. కానీ జీవితంలో అది కూడా వెయ్యడం లేదు, ఆ ప్రాజెక్టుల పాటి చెయ్యవా మన జీవితాలు?

మొన్న రాత్రి నీకు జరిగినది నువ్వు తేలిగ్గా తీసి పడేయ్యాల్సిన విషయం కాదు ప్రియా, అదే మరెక్కడైనా జరిగి నువ్వే రోడ్డు మీదో పడిపోతే? అదెంత పెద్ద రిస్క్? దానికి నివారణ మనమేమీ ప్లాన్ చెయ్యలేదే? ఈ ఉద్యోగాల వల్ల అలాంటి పరిస్థితి వస్తుందని కూడా మనమెపుడూ ఫాక్టర్ చెయ్యలేదే? ఇదేనా మన ప్రాజెక్ట్ మేనేజ్మెంట్? జీవితం కంటే పెద్ద ప్రోజెక్ట్ ఉందా ప్రియా ? నువ్వూ సిధూ ఆనందంగానూ, హాయిగానూ లేని జీవితం నాకు కావాలా?

సుశీలమ్మ ఒక్క రోజు రాకపోతే సిధుని మనిద్దరిలో ఎవరో ఒకరు చూసుకోలేమా? అంత టైము లేదా మనకి? లేనప్పుడు ఏమున్నా ఒకటే కదా? " ఎర్రబడిన వసంత్ ముఖం కోపంతో అదురుతోంది, ఎప్పటినించో, మనసులో పేరుకుపోయిన వేదనంతా బయటకి వస్తున్నట్టుగా ఉద్వేగంగా ఉన్నాడు అతను.

ఏదో చెప్పబోతున్న ప్రియని వారించాడు ప్రసాద్.

" ప్రియ పని అయ్యాకా మీరు కొన్నాళ్ళు హాలిడే కి వెళ్ళి వస్తే బావుంటుందేమో నాన్నా" అన్నారు.

" ఇప్పటికెన్ని సార్లు ప్లాన్ చేసామో, ఎందుకు కాన్సిల్ అయిందో ?అడగండి తనని, ఇవన్నీ అయ్యేవి కాదు అంకుల్, ఇదొక పద్మవ్యూహం, అందులోకి వెళ్ళినవాళ్ళందరూ అభిమన్యుళ్ళే, ఒక్కసారి వెళ్తే వెనక్కి రాలేరు, మీరు పద్మప్రియ అని పేరు పెట్టినందుకేనేమో చాలా ప్రియంగా వెళ్ళిపోయింది అందులోకి, ఇక తనకిప్పుడు రావాలన్నా ఈ కార్పోరేట్ పద్మవ్యూహం లోంచి బయటకు రావడం కష్టం, అదామె నైజానికి కుదిరేదే కాదు. ఆ విషయం మీకూ తెలుసు. మా జీవితాలన్నీ వైర్లతోనూ, వైరులెస్స్ లతోనూ ముడిపడిపోయాయి మనకి నచ్చినా లేకపోయినా, ఎక్కడకెళ్ళినా హచ్ కుక్క ( వోడాఫోన్ పప్పీ) లా వెనకే తిరిగే పనీ, ఖర్మ కాలి మర్చిపోతామేమో అని ఠంగూ, ఠంగూ మంటూ రింగు టోన్లు కొట్టుకుంటూ మెయిల్సూ, మెసేజ్ లూ, వాటిని తమతో మోస్తూ మా నెత్తినెక్కి తాండవమాడుతున్న ఈ 'సోకాల్డ్ స్మార్ట్ ఫోను లూ", ఇలా ఎక్కడికెళ్ళినా తప్పని హెచ్చరికలే. ఏదో తెలియని ఉక్రోషం అతని గొంతులో.

" మీకు గుర్తుందా? అంకుల్, మాకు కాంపస్ ఉద్యోగాలొచ్చినప్పుడు మీరందరూ ఎంత సంబరపడిపోయారో? మేమైతే ప్రపంచాన్ని జయించినంత సంతోషించాం, అదే ఈ సమస్యలన్నింటికీ మూల కారణం అనిపిస్తుంది నాకు. అవే మమ్మల్ని టైం మెషీన్ లో పెట్టేసి పదేళ్ళు ముందుకు తిప్పేశాయి, ఇరవై ఒకటీ, ఇరవై రెండేళ్ళకే ఉద్యోగాలు, ఉద్యోగం వచ్చేసింది కదా అని వెంటనే పెళ్ళీ, ఇంటా బయటా పెరిగిన బాధ్యతలూ, ఇవన్నీ, మీరు యాభై ఏళ్ళకి చేరిన దశకి మమ్మల్ని ముప్పై ల్లోనే తీసుకెళ్ళిపోతున్నాయి. ఇప్పుడు వెనక్కి చూస్తే మేము కొనుక్కున్న ఈ ఫ్లాట్, తయారవుతున్న మరొక ఫ్లాటూ, రెండు కార్లూ, ముగ్గురు పనిమనుషులని పెట్టుకుని ఇల్లు నడుపించుకోగల ఆర్థిక స్థోమతా ఉన్నాయి. కానీ ఏమి లేవో, ఉండటం లేదో? అని ఆలోచిస్తే మాత్రం ఇవన్నీ లేకపోయినా పరవాలేదు అనిపిస్తుంది నాకు.

ఇంకొకటి చెప్పనా అంకుల్? ఎక్కడివాడో తమకి అక్కరలేని పనులన్నీ " ఔట్ సోర్సింగ్" పేరిట మన ముఖాన పడేస్తే మనం దాన్ని "మహా ప్రసాదం" గా భావించి పని చేస్తున్నాము అని ఈ మధ్య నాకు తరచూ అనిపిస్తోంది. ముందే చెప్పాను కదా, ఇవన్నీ నా అభిప్రాయాలు మాత్ర మే, ప్రియ కి ఇదంతా సిల్లీగా అనిపించవచ్చు. ఈ కార్పోరేట్ పద్మ వ్యూహాల్లోకి ఇంకా పూర్తిగా కూరుకుపోకముందే ఇది వదిలేసి మరొకటేదైనా చేద్దామని ఆలోచన.

నిజానికి "హౌస్ వైఫ్ ( House Wife) , స్టే ఎట్ హోం మాం ( Stay at home mom) అనే పదాలు ఇంటిపట్టున ఉండి ఇల్లు చూసుకునే గృహిణులకోసం వాడుతున్నారు, అలా హౌస్ హజ్బెండ్ గా నూ ( House Husband), స్టే ఎట్ హోం ఫాదర్ గానూ( Stay at home father) ఉండి వీళ్ళిద్దరినీ జాగ్రత్త గా చూసుకోడానికి నాకేమీ అభ్యంతరం లేదు, కానీ నాకంటూ స్వంతమైన పని ఉండాలి, దాని చేతిలో నేను కాక, పని నా చేతిలో ఉండాలి అన్న ఆలోచన తోనే నేనూ నేనూ, నా స్నేహితుడు సునీల్ కలిసి ఒక చిన్న ప్రయత్నం మొదలు పెడదామని ఆలోచన. నిన్నరాత్రి అమ్మా, నాన్నలతో చెప్పాను, బాధపడ్డారు కానీ ఎదిగిన కొడుకుని తిట్టలేరు కదా చిన్నప్పటిలా "ప్రియని చూసి బుద్ధి తెచ్చుకో" అని అనలేదు" అన్నాడు సుదీర్ఘమైన తన వాదాన్ని చిన్న చిరునవ్వుతో ముగించడానికి ప్రయత్నిస్తూ.

చీమ చిటుక్కుమన్నా వినిపించేంత నిశ్శబ్దం ఆ గదిలో...

●●●

Click here to share your comments on this story